

సాక్షి
నంద్యాల
మంగళవారం : 11 : ఏప్రిల్ : 2023



జలకాలాటలలో..
హొళగుంద: ఎండల తీవ్రత పెరుగుతుండటంతో మధ్యాహ్నం వేళ యువకులు, విద్యార్థులు బావులు, కాలువల వద్దకు చేరుకుంటున్నారు. ఈత కొడుతూ వేసవి తాపం తీర్చుకుంటున్నారు.



సంగమేశ్వరుడికి పూజలు
కొత్తపల్లి: సప్తనది సంగమ ప్రాంతంలో వెలిసిన సంగమేశ్వరుడికి భక్తులు సోమవారం దీపోత్సవం నిర్వహించి పూజలు చేశారు. వివిధ ప్రాంతా ల భక్తులు స్వామిని దర్శించుకున్నారు.



కొండరాయి వద్ద ఉండొద్దు
పగిలిన కొండరాయి వద్ద ఎవరూ ఉండొద్దని, ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రదేశానికి తరలి వెళ్లాలని గోనెగండ్ల ఎస్సీ కాలనీ వాసులకు సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సూచించారు. 10లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:37	ఉ॥ 4:42
ఆదోని	సా॥ 6:40	ఉ॥ 4:45
నంద్యాల	సా॥ 6:37	ఉ॥ 4:45
ఆత్మకూరు	సా॥ 6:35	ఉ॥ 4:39
బనగానపల్లె	సా॥ 6:40	ఉ॥ 4:39

హదీస్ వెలుగు :
రంజాన్ ఉపవాస దీక్షలకు భంగం కలుగకుండా ఉండేందుకు చంద్ర దర్శనమైన మరుక్షణమే సైతానును అల్లాహ్ ఖైదు చేసి ఉంచుతారు. ఈ మాసంలో రోజా, నమాజు, జికర్, జకాత్, ఆధ్యాత్మికతపై అధిక దృష్టి పెట్టండి.- పవిత్ర ఖురాన్

న్యూస్‌రీల్

345 మంది విద్యార్థులు గైర్హాజరు



కేంద్రాలను తనిఖీ చేస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

నంద్యాల(సిటీ): జిల్లాలో సోమవారం జరిగిన పదో తరగతి పరీక్షలకు 345 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 125 పరీక్ష కేంద్రాల్లో జరిగిన మాథ్స్ పరీక్షకు సంబంధించి జిల్లాలో 24,700 మంది విద్యార్థులకు గాను 24,355 మంది హాజరయ్యారు. డీఈఓ అనురాధ ఎనిమిది పరీక్ష కేంద్రాలను, ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 27 పరీక్షా కేంద్రాలను పరిశీలించాయి. అదేవిధంగా జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి ఐదు, పరీక్షల సహాయ కమిషనర్ గోపాల్ రెండు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. సమస్యాత్మక కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్ పర్యవేక్షణలో పరీక్షలు సజావుగా నిర్వహించారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

కొలిమిగుండ్ల: వేసవిని దృష్టిలో ఉంచుకొని ఉపాధి కూలీలకు అందజేసేందుకు ఫీల్డ్ అసిస్టెంట్లకు సోమవారం స్థానిక కార్యాలయంలో తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్, ఏపీఓ గంగన్నతో కలిసి ఎంపీడీఓ సుబ్బరాజు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఎండలు తీవ్రం కావడంతో వడ దెబ్బ బారిన పడకుండా మంచినీటిలో ఓఆర్ఎస్ కలుపుకొని తాగాలని సూచించారు. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో పనులు జరిగే చోట టెంట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

పాఠశాలలు తెరిచేలోపు 'విద్యా కానుక'



మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకుడు శ్రీనివాసులు

ఆళ్లగడ్డ/శిరివెళ్ల: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరిచేలోగా విద్యార్థులకు జగనన్న విద్యాకానుక అందించడం జరుతుందని రాష్ట్ర పరిశీలకుడు శ్రీనివాసులు అన్నారు. విద్యా కానుక సరఫరాకు ఆళ్లగడ్డ మండలం వైపీపీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శిరివెళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలను స్టాక్ పాయింట్‌గా గుర్తించామన్నారు. కిట్లను జిల్లా కేంద్రం నుంచి ప్రత్యేక బస్‌లలో ఇక్కడికి తరలిస్తామన్నారు. కిట్లు పారదర్శకంగా సరఫరా చేసేందుకు మండల స్థాయిలో టీంలను ఏర్పాటు చేస్తామన్నారు.

15లోపు మిషన్ వాత్సల్యకు దరఖాస్తు చేసుకోండి



మాట్లాడుతున్న లీలావతి

నంద్యాల (రూరల్): మిషన్ వాత్సల్య పథకానికి ఈ నెల 15వ తేదీ లోపు జిల్లాలో అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ లీలావతి అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ అనాథ పిల్లలను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని ప్రవేశ పెట్టాయన్నారు. ఎంపికైన చిన్నారులకు నెలకు రూ.4 వేల చొప్పున మంజూరవుతాయన్నారు. గ్రామాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ.72 వేల లోపు, పట్టణ ప్రాంతాల్లో రూ.96 వేల లోపు ఉన్న వారి పిల్లలు, తల్లి వితంతు లేదా విడాకులు తీసుకోవడం, తండ్రి కుటుంబాన్ని విడిచి పెట్టిన పిల్లలు, తల్లిదండ్రులను కోల్పోయిన అనాథలు అర్హులన్నారు. ధ్రువీకరణ జిరాక్స్ పత్రాలతో దరఖాస్తులను స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేయాలన్నారు.

విజయ లక్ష్యం.. నైపుణ్య మంత్రం

- నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ
- జిల్లాలో ఎనిమిది స్కిల్ హబ్ కేంద్రాలు
- ఇప్పటికే 13 జాబ్‌మేళాల్లో 1600 మందికి ఉద్యోగ అవకాశాలు



యువతీ యువకులకు శిక్షణ అందిస్తున్న దృశ్యం

నంద్యాల: ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన స్కిల్ హబ్ కేంద్రాలు నిరుద్యోగ యువతకు వరంగా మారాయి. ఉన్నత చదువులు, డిగ్రీ చదివిన వారితో పాటు ఇంటర్, పదో తరగతి పూర్తి చేసిన యువతలో వృత్తినైపుణ్యాలను పెంచి వారు కూడా కొలువులు పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ), సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (సీడాప్) సంస్థలు నిరుద్యోగ యువత ఆశయాలను నెరవేరుస్తున్నాయి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంపొందించి ప్రయోజకులుగా తీర్చిదిద్దుతున్నాయి. భవిష్యత్తులో పరిశ్రమల విస్తరణకు అనుగుణంగా ఉద్యోగ, ఉపాధి లభించేలా నిరుద్యోగ యువతలో నైపుణ్యాలు పెంపొందించేకు అధికారులు స్కిల్ హబ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మూడు నెలల కాల పరిమితి ఉన్న పలు కోర్సుల్లో శిక్షణ ఇస్తారు. జిల్లాలోని నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, నందికొట్కూరులో ఒక్కొక్కటి చొప్పున, శ్రీశైలం, డోన్ నియోజక వర్గాల పరిధిలో రెండు చొప్పున స్కిల్ హబ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

వృత్తినైపుణ్యాలను పెంపొందించి..

ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఎంట్రీ ఆపరేటర్, కంప్యూటర్ హార్డ్‌వేర్, ఐటీ సేల్స్, టెలీకాలర్ వాయిస్, సెల్ ఎంప్లాయిడ్ టైలర్, నర్సరీ వర్కర్, కంప్యూటర్ హార్డ్‌వేర్, ఎలక్ట్రీషియన్, సర్వేయర్, ప్లంబర్, జూనియర్ సాఫ్ట్‌వేర్, డెవలపర్ వంటి వాటిపై నిపుణులతో శిక్షణ అందించనున్నారు. ఒక్కో కోర్సులో 30 సీట్లు కేటాయించారు. 18 నుంచి 26 సంవత్సరాల వయస్సు ఉన్న పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, పీజీ చేసిన వారు అర్హులు. నిరుద్యోగ అభ్యర్థులకు సంబంధిత సెక్టార్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వారిచే గుర్తింపు పొందిన నిపుణులు శిక్షణ అందిస్తారు. వివిధ రంగాల్లో నైపుణ్యం కలిగిన వ్యక్తులు, సబ్జెక్టు నిపుణులు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తారు. ముఖాముఖి, గ్రూపు చర్చలు, ప్రసంగం తదితర అంశాల్లో అభ్యర్థులకు మెలకువలు నేర్పుతారు. శిక్షణ పొందిన వారికి అర్హతల ఆధారంగా ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 13 జాబ్ మేళాలు నిర్వహించి 1,600 మంది నిరుద్యోగ యువతీ యువకులకు వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించారు. కోగ్నెట్, ఇన్ఫోసిస్, టీసీఎస్, విప్రో, కాగ్నిజెంట్, హెటిరో, ఎక్స్ట్రా మార్క్స్ ఎడ్యుకేషన్ సంస్థ, టాలెంట్ ఎరా, దివిస్, డెక్కన్ ఫార్మా, ఒమెగా తదితర కంపెనీల్లో వీరంతా ఉద్యోగాలు పొందారు.



డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

కంప్యూటర్ శిక్షణ తీసుకున్నా



బీఎస్సీ విద్యార్థిని కావడంతో కంప్యూటర్‌పై పెద్దగా అవగాహన లేదు. స్నేహితులతో పాటు సీనియర్లు సలహా ఇవ్వడంతో నందికొట్కూ రు స్కిల్ హబ్ కేంద్రంలో చేరాను. అక్కడ ఎదుటి వ్యక్తితో ఎలా మాట్లాడాలి, సమాధానం ఎలా చెప్పాలి, తదితర అంశాలతోపాటు కంప్యూటర్ కోర్సులో శిక్షణ ఇచ్చారు. జాబ్ మేళాలో పాల్గొనడంతో కోగ్నెట్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది.
– బి. హారిక, నందికొట్కూరు

ఆర్థిక భారం ఉండదు



నంద్యాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ కేంద్రంలో చేరి కంప్యూటర్‌పై పూర్తిస్థాయి అవగాహన తెచ్చుకున్నాను. ఈ కేంద్రంలో చేరితే అనేక ఉపయోగాలు ఉన్నాయి. రూపాయి ఖర్చు లేకుండా కంప్యూటర్ కోర్సు నేర్పించడమే కాకుండా జాబ్‌మేళాలో ఉద్యోగం సాధించేలా నిర్వాహకులు తీర్చిదిద్దుతున్నారు. నాకు కోగ్నెట్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది.
– టి.రమాదేవి, నంద్యాల

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలోని స్కిల్ హబ్ కేంద్రాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి. ఉద్యోగ అభ్యర్థులు నైపుణ్యం సాధించేలా శిక్షణ ఇస్తున్నాం. శిక్షణ పూర్తి చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం. చదువు పూర్తి చేసుకున్న యువతకు ఈ రెండు సంస్థల ద్వారా ఉద్యోగ భద్రత కలుగుతుంది. ఇప్పటి వరకు వివిధ కంపెనీల్లో 1,600 మందికి ఉద్యోగాలు కల్పించాం.
– ప్రతాపరెడ్డి, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి, నంద్యాల

స్కిల్ హబ్ కేంద్రం, సంప్రదించాల్సిన నంబర్

పీఎస్సీ, కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, నంద్యాల	8297812530
జీటీ ఆర్ఎం డిగ్రీ కళాశాల, యర్రగుంట్ల, ఆళ్లగడ్డ	9701303790
కృషి విజయాన్ కేంద్రం, బనగానపల్లె	9705998056
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నందికొట్కూరు	9154830286
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆత్మకూరు	9885912685
ప్రభుత్వ ఐటీఐ కళాశాల, శ్రీశైలం	9705683538
ఎన్‌పీసీ కేంద్రం, డోన్	7891238237
స్కిల్‌డెవలప్‌మెంట్ కేంద్రం, డోన్	9573108032

209 మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు

- నేడు ఎంపికైన అభ్యర్థులకు సమాచారం
- 12న ఉద్యోగ నియామక పత్రాలు జారీ

కర్నూలు సిటీ: పాతికేళ్ల కల నెరవేరింది. డీఎస్సీ–1998లో అర్హత సాధించి, మెరిట్ లిస్టులో ఉన్న 209 మంది అభ్యర్థులకు ఉపాధ్యాయ ఉద్యోగాలు రానున్నాయి. వీరిని మినిమం టైం స్కేలు(ఎంటీఎస్)పై కాంట్రాక్టు ఎస్జీటీ(సెకండరీ గ్రేడ్ టీచర్)లుగా నియమించనున్నారు. ఇటీవలే పాఠశాల విద్యాశాఖ పోస్టుల భర్తీకి సంబంధించిన షెడ్యూల్‌ను జారీ చేసింది. సోమవారం ఉమ్మడి జిల్లా సెలక్షన్ కమిటీ ఆ పోస్టులకు ఆమోద ముద్ర వేసింది. 1998 డీఎస్సీలో అర్హత పొందిన వారిని మెరిట్ ప్రాతిపదికన ఈ పోస్టుల్లో భర్తీ చేయనున్నారు. జిల్లాలో మొత్తం 209 మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు రానున్నాయి. ఉద్యోగాలకు ఎంపికై న వారికి మంగళవారం సమాచారం ఇవ్వనున్నారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 12న నగరంలోని ఎ.క్యాంప్ మాంటిస్సోరి స్కూల్‌లో ఎంపికైన వారికి నియామక పత్రాలను ఇవ్వనున్నారు. వీరిని ఏకోపాధ్యాయ స్కూళ్లలోను, విద్యార్థుల సంఖ్య ఎక్కువ ఉండి, తక్కువ మంది టీచర్లు పనిచేస్తున్న పాఠశాలల్లోనూ నియమించనున్నారు. వీరందరికీ ఈ వేసవిలో శిక్షణ ఇవ్వనున్నారు.

సెగలు కక్కుతున్న సూరీడు



కర్నూలు (అగ్రికల్చర్): భానుడు సెగలు కక్కుతున్నాడు. ఉమ్మడి జిల్లాలో సోమవారం ఎండలు మండిపోగా, వడగాలుల తీవ్ర పెరిగింది. రానున్న మూడు, నాలుగు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే ప్రమాదం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. కర్నూలు జిల్లా గోనెగండ్లలో ఆదివారం ఎండల తీవ్రతకు పెద్దబండరాయి పగలడం సంచలనం కలిగించింది. విషయం తెలిసి ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. నంద్యాల జిల్లాలో నందికొట్కూరు మండలం బొల్లవరంలో అత్యధికంగా 41.6 డిగ్రీలు నమోదైంది. అవుకు 41.51, కొత్తపల్లి 41.47, సంజామల 41.2, కర్నూలు 41.5, కోడుమూరు మండలం లద్దగిరిలో 40.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

కుంభోత్సవానికి సర్వం సిద్ధం



అమ్మవారి ఆలయాన్ని నిమ్మకాయలతో అలంకరించిన దృశ్యం



అమ్మవారికి సాత్వికబలి సమర్పించేందుకు సిద్ధం చేసిన గుమ్మడికాయలు, నిమ్మకాయలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన దేవస్థానం

శ్రీశైలంటెంపుల్: లోక కల్యాణం కోసం శ్రీశైల శ్రీభ్రమరాంబాదేవికి మంగళవారం కుంభోత్సవం నిర్వహించనున్నారు. ఈ ఉత్సవంలో గుమ్మడికాయలు, కొబ్బరికాయలు, నిమ్మకాయలు, అన్నపురాశి మొదలైనవి అమ్మవారికి సాత్వికబలిగా సమర్పిస్తారు. ఈ మేరకు శ్రీశైల దేవస్థానం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. సోమవారం అమ్మవారి ఆలయాన్ని నిమ్మకాయల దండలతో అలంకరించారు. అలాగే గుమ్మడికాయలు, కొబ్బరికాయలు ఆలయానికి చేర్చారు. మంగళవారం ఉదయం ప్రాతఃకాల పూజల అనంతరం అమ్మవారికి ఆలయ అర్చకులు నవావరణపూజ, త్రిశతి, ఖడ్గమాల, అష్టోత్తర శతనామ కుంకుమపూజలను, జపపారాయణలను నిర్వహిస్తారు. ఆచారాన్ని అనుసరించి ఈ పూజలన్ని ఏకాంతంగా జరిపిస్తారు. అనంతరం అమ్మవారి ఆలయం ముందు రజకునిచే ముగ్గు వేయించి భ్రమరాంబాదేవికి మొదటి విడత సాత్విక బలి సమర్పిస్తారు. కుంభోత్సవంలో భాగంగానే హరిహరరాయ గోపురం వద ఉన్న మహిషాసుర మర్దిని అమ్మవారికి ప్రత్యేక పూజాదికాలను జరిపించి సాత్వికబలిగా కొబ్బరికాయలను సమర్పిస్తారు. సాయంత్రం మల్లికార్జున స్వామివారికి ప్రదోషకాల పూజల అనంతరం అన్నాభిషేకం జరిపించి ఆలయ ద్వారాలు మూసివేస్తారు. అనంతరం అమ్మవారి ఆలయానికి ఎదురుగా సింహ మండపం వద్ద వండిన అన్నకుంభరాశిగా పోసి సంప్రదాయాన్ని అనుసరించి స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభహారతిని సమర్పిస్తాడు. అనంతరం భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతిస్తారు. అలాగే అమ్మవారికి ప్రత్యేక పూజలను చేసి తొమ్మిది రకాల పిండివంటలతో మహానివేదన చేస్తారు.

స్పందన అర్జీలను గడువులోగా పరిష్కరించండి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: స్పందన అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు, డీఆర్ఓ పుల్లయ్య, ఇతర జిల్లా ఉన్నతాధికారులు ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఏ సచివాలయం నుంచి అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయో సంబంధిత తహసీల్దార్, ఆర్డీఓ స్వయంగా వెళ్లి కారణాలను అన్వేషించాలన్నారు. అర్జీదారులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీదారులకు అర్థమయ్యే విధంగా పరిష్కార నివేదిక పంపాలన్నారు. ప్రతి అధికారి స్పందన ద్వారా స్వీకరించిన అర్జీలను క్షుణ్ణంగా చదివి రోజుకు అరగంట పాటు ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యలు పరిష్కరించాలన్నారు. సోమవారం స్పందనలో 152 వినతులు వచ్చాయని, వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

స్పందనలో కొన్ని వినతులు..

- తన తమ్ముడు కుమారుడికి ఆధార్ కార్డు ఇవ్వాలని, ఇప్పటికే తల్లిదండ్రులు చనిపోయారని, అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించేందుకు ఆధార్ కార్డు కోసం సచివాలయంలోని పంచాయతీ సెక్రటరీ చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా పట్టించుకోవడం లేదని నంద్యాల మండలం చాబోలుకు చెందిన అంధుడు భీమన్న కలెక్టర్‌కు అర్జీ అందజేశాడు.
- వెలుగోడు మండలం బోయరేవుల గ్రామానికి చెందిన పి.లక్ష్మీదేవి తనకు సదరన్ సర్టిఫికెట్ మంజూరు చేయించాలని స్పందనలో అర్జీ ఇచ్చారు.
- పాములపాడు మండలం మద్దూరులోని సర్వేనంబర్ 433లో తన పేరు మీద రెండు ఎకరాల డీకేటీ భూమి ఉందని, విక్రయించేందుకు ఎన్‌ఓసి మంజూరు చేయించాలని ఎం. ఇబ్రహీం అనే వ్యక్తి వినతి పత్రం అందజేశారు.
- శిరివెళ్ల మండలం మహాదేవపురం గ్రామానికి చెందిన పి.వెంకటన్న తనకు ఇంటి స్థలం మంజూరు చేయించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

సీఎఫ్‌ఎంఎస్ ద్వారా ఏపీజీఎల్ఐ సేవలు

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీవిత బీమా సర్వీస్‌లన్నీ సీఎఫ్‌ఎంఎస్ ద్వారా జరుగుతాయని, ఈ ప్రక్రియను అతి త్వరలో కార్యరూపంలోకి రానుందని ఏపీజీఎల్ఐ డైరెక్టర్ రెడ్డి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన కర్నూలు ఏపీజీఎల్ఐ జాయింట్ డైరెక్టర్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తనిఖీలో భాగంగా విచారణలు నిర్వహిస్తున్నామని, అన్నింటిని విశ్లేషించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇక నుంచి ఏపీజీఎల్ఐ బాండ్లు ఉద్యోగుల సీఎఫ్ఎంఎస్ ఐడీ నెంబర్లతో జారీ అవుతాయన్నారు. రాష్ట్రం మొత్తం మీద ఈ ఏడాది మార్చి నెల వరకు పెండింగ్‌లోని ఏపీజీఎల్ఐ మెచ్యూరిటీ క్లైయిమ్‌లు, డెత్ క్లైయిమ్‌లు, లోన్ క్లైయిమ్


మాట్లాడుతున్న ఏపీజీఎల్ఐ డైరెక్టర్ రెడ్డి శ్రీనివాస్

లన్నింటినీ క్లియర్ చేశామని, ఇందుకోసం రూ.380 కోట్లు చెల్లించామన్నారు. రాష్ట్రంలో సచివాలయ ఉద్యోగులతో సహా 5 లక్షల మందికి పైగా ఉద్యోగులు ఏపీజీఎల్ఐ పాలసీదారులుగా ఉన్నట్లు చెప్పారు. ఉద్యోగులు స్లాబ్ రేట్ ప్రకారం ప్రీమియం చెల్లించాల్సి ఉందని, అయితే కొంతమంది తక్కువ చెల్లిస్తున్నారని, ఈ విషయంలో డీడీఓలు బాధ్యత తీసుకోవాలన్నారు. స్లాబ్ రేట్ ప్రకారం ప్రీమియం చెల్లించకపోతే ఉద్యోగుల వేతనాలను నిలుపుదల చేస్తామరు. ఆయన వెంట ఏపీజీఎల్ఐ జాయింట్ డైరెక్టర్ క్రిష్ణ, ఏడీ వెంకటేశ్వర్లు తదితరులు టున్నారు.

ఈ రెండింటిపై లోతుగా విచారణ

- ఏపీజీఎల్ఐ జాయింట్ డైరెక్టర్ అద్దె ప్రాతిపదికన ఇన్నోవా వాహనం వినియోగించుకునే అవకాశం ఉంది. అయితే ఒక్క రోజు కూడా అద్దె వాహనం వినియోగించకపోయినా బిల్లులు మాత్రం పొందుతూ వచ్చారు. దీనిని గతంలో 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది.
- ఇటీవల ఆఫీసు సూపరింటెండెంటు ఒకరు మద్యం సేవించి వచ్చి గొడవ చేసినట్లు మహిళా ఉద్యోగుల నుంచి పిర్యాదులు వచ్చాయి. ఈ పంచాయితీ 3వ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు చేరింది.

12న వైఎస్సార్ ఈబీసీ నేస్తం

- విడుదల కానున్న రూ.33.98 కోట్లు
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 22,655 మందికి లబ్ధి
- ఒక్కొక్కరి ఖాతాలోకి రూ.15 వేలు జమ

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం కింద అగ్రవర్ణాల్లోని పేద, మధ్య తరగతి వర్గాల మహిళలకు ఈ నెల 12వ తేదిన నగదు జమ కానుంది. ఈ పథకాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకాశం జిల్లా మార్కాపురంలో ఉదయం 11 గంటలకు ప్రారంభించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం కింద అగ్ర వర్ణాలైన కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమ తదితర కులాల్లోని పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన 45 నుంచి 60 సంవత్సరాల్లోపు మహిళలకు ఆర్థిక చేయూతను అందించనుంది. ప్రభుత్వ నియమ నిబంధనలు, తగిన అర్హతలతో ఎంపికైన మహిళలకు ఒక్కొక్కరికి రూ.15 వేలను అందించనున్నారు. ఈ పథకం కింద ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 22,655 మంది మహిళల బ్యాంకు ఖాతాల్లోకి రూ. 33,98,25,000 జమ చేయనున్నారు. కర్నూలు జిల్లాలో 7,861 మంది మహిళలకు రూ.11,79,15,000.. నంద్యాల జిల్లాలో 14,794 మంది మహిళలకు రూ.22,19,10,000 జమ కానున్నాయి.

నియోజకవర్గాల వారీగా ఎంపికైన మహిళలు

నియోజకవర్గం	కమ్మ	రెడ్డి	ఆర్యవైశ్య	బ్రాహ్మణ	క్షత్రియ	వెలమ	ఇతరులు	మొత్తం
ఆదోని	48	284	186	81	02	00	47	648
ఆలూరు	182	366	102	35	00	00	21	706
కోడుమూరు	46	550	89	23	00	00	27	735
కర్నూలు	84	268	586	153	02	00	66	1159
మంత్రాలయం	45	260	151	109	13	00	24	602
పాణ్యం	123	1488	405	181	02	00	63	2262
పత్తికొండ	263	661	135	16	00	00	31	1106
ఎమ్మిగనూరు	41	403	133	35	01	00	30	643
ఆళ్లగడ్డ	205	2427	447	50	00	00	67	3196
బనగానపల్లె	160	2754	325	68	01	00	44	3352
డోన్	231	1332	319	35	00	00	29	1946
నందికొట్కూరు	77	1174	239	47	00	15	42	1594
నంద్యాల	125	1660	872	112	00	00	67	2836
శ్రీశైలం	217	1146	378	62	00	36	31	1870
మొత్తం:	1847	14773	4367	1007	21	51	589	22655

సచివాలయ సిబ్బందికి మెమోలు


రికార్డులను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు

నంద్యాల(సిటీ): విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎనిమిది మంది సచివాలయ సిబ్బందికి నంద్యాల మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు మెమోలు జారీ చేశారు. సోమవారం ఆయన పట్టణంలోని పలు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని 8, 9, 10, 12 వార్డు సచివాలయాల్లో కొందరు సిబ్బంది అందుబాటులో లేక పోవడం, మరి కొందరు డ్రెస్ కోడ్ ఉల్లంఘించడంతో మెమోలు జారీ చేశారు. ప్రజల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. సచివాలయంలో అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

తేనెటీగల దాడిలో ఉద్యోగులకు గాయాలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం డ్యామ్ ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులపై సోమవారం తేనెటీగలు దాడి చేశాయి. డ్యామ్‌కు కొన్ని చోట్ల తేనెటీగల తెట్టలు విరివిగా ఉన్నాయి. సోమవారం తేనెతెట్టను గుర్తు తెలియని వ్యక్తులు కదిలించడంతో అక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులపై దాడి చేశాయి. వీరంతా శ్రీశైలం ప్రాజెక్ట్ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స చేయించుకున్నారు.

నేడు ఉపాధ్యాయులకు శిక్షణ

నంద్యాల(సిటీ): జిల్లాలో 8వ తరగతి బోధిస్తున్న ఉపాధ్యాయులందరికీ మంగళవారం వెబెక్స్ ద్వారా మూడు సెషన్లలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారిణి అనురాధ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.



నేడు భూసార పరీక్షలపై జిల్లా స్థాయి వర్క్ షాపు

కర్నూలు(అగ్రికల్చర్): ప్రభుత్వం 2023-24లో భూసార పరీక్షల నిర్వహణకు పెద్దపీట వేస్తోంది. పరీక్షల నిర్వహణకు ఇప్పటికే వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్ మార్గదర్శకాలు జారీ చేశారు. ఇందులో భాగంగా ఈ నెల 11న భూసార పరీక్షల నిర్వహణపై జిల్లా స్థాయి వర్క్‌షాపు నిర్వహించనున్నారు. ఓర్వకల్లు మండలం నన్నూరులోని రైతుభరోసా కేంద్రం-2లో మంగళవారం వర్క్‌షాపు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. అన్ని మండలాల వ్యవసాయాధికారులు, సబ్ డివిజన్ ఏడీఏలు, భూసార పరీక్ష కేంద్రాల ఏవోలు, ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్ సెంటర్ల డాక్టర్లు, వైఎస్ఆర్ ఇంటిగ్రేటెడ్ అగ్రీ ల్యాబ్ ఏవోలు వర్క్‌షాపునకు హాజరు కానున్నారు. క్షేత్రస్థాయిలో 50 మట్టి నమూనాలను సేకరించి కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులోని భూసార పరీక్ష కేంద్రానికి పంపుతారని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఈ నెల 16లోపు మండల స్థాయిలో ఆర్‌బీకే ఇన్‌చార్జీలకు భూసార పరీక్షల నిర్వహణపై అవగాహన సదస్సులు నిర్వహిస్తారు.

ఓపెన్ పరీక్షలకు 157 మంది గైర్హాజరు

నంద్యాల(సిటీ): జిల్లాలో ఆరు పరీక్షా కేంద్రాల్లో జరుగుతున్న ఓపెన్ పది పరీక్షలకు 967 మంది విద్యార్థులకు గాను 872 మంది హాజరు కాగా 95 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఎనిమిది పరీక్ష కేంద్రాల్లో జరిగిన ఇంటర్ ఓపెన్ పరీక్షలకు 645 మంది విద్యార్థులకు గాను 583 మంది హాజరు కాగా 62 మంది గైర్హాజరయ్యారు. ఆత్మకూరులో ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రంలో ఒకరి బదులు మరొక విద్యార్థి పరీక్ష రాయడాన్ని అధికారులు గుర్తించి కేసు నమోదు చేసి విద్యార్థిని డిబార్ చేశారు. జిల్లా వ్యాప్తంగా 6 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 14 పరీక్ష కేంద్రాలను, డీఈఓ అనురాధ రెండు కేంద్రాలను తనిఖీ చేశారు.

అన్నప్రసాద వితరణ పథకానికి విరాళం


దాతకు జ్ఞాపికను అందజేస్తున్న అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి కర్ణాటకకుకు చెందిన సిసి పాటిల్ రూ.1,00,116 లు విరాళంగా అందజేశారు. దాతకు ఆలయ అధికారులు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు విరాళానికి సంబంధించిన బాండు, స్వామిఅమ్మవార్ల జ్ఞాపికను అందజేశారు.

రాజస్థాన్‌కు కర్నూలు విత్తనాలు

కర్నూలు(అగ్రికల్చర్): రాజస్థాన్ రాష్ట్రానికి కర్నూలు నుంచి విత్తనాలు పంపించనున్నారు. ఈ నేపథ్యంలో రాజస్థాన్ రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ జస్వంత్‌సింగ్, జనరల్ మేనేజర్ జగ్‌దేవ్‌సింగ్ సోమవారం కర్నూలులోని వివిధ సీడ్ కంపెనీలను సందర్శించారు. విత్తనాల నాణ్యత, ప్రాసెసింగ్, ప్యాకింగ్ తదితర వాటిని పరిశీలించారు. తుంగభద్ర అగ్రిటెక్ అధినేత నాగిరెడ్డి, మురళీధర్ సీడ్ చైర్మన్ మురళీధర్‌రెడ్డి అన్ని ప్లాంట్‌ల్లో జరుగుతున్న ప్రాసెసింగ్, ప్యాకింగ్ ప్రక్రియను చూపించారు. ఈ సందర్భంగా రాజస్థాన్ సేట్ సీడ్ కార్పొరేషన్ ఎండీ జస్వంత్‌సింగ్ మాట్లాడుతూ.. 20 ఏళ్లుగా కర్నూలు జిల్లాలో మొక్కజొన్న, సజ్జ హైబ్రిడ్ విత్తనోత్పత్తి చేయిస్తున్నామన్నారు. ఈ ఏడాది కర్నూలు నుంచి 21వేల క్వింటాళ్ల మొక్కజొన్న, 16వేల క్వింటాళ్ల సజ్జ విత్తనోత్పత్తి చేశామని, ప్రాసెసింగ్, ప్యాకింగ్


మొక్కజొన్న విత్తనాలను పరిశీలిస్తున్న రాజస్థాన్ స్టేట్ సీడ్ కార్పొరేషన్ ఎండీ జస్వంత్‌సింగ్ తదితరులు

ప్రక్రియ పూర్తి అయిన తర్వాత రాజస్థాన్‌కు తరలిస్తామని స్పష్టం చేశారు. కర్నూలు జిల్లాలో ఉత్పత్తి చేసిన విత్తనాలు పూర్తి నాణ్యతతో ఉంటున్నాయని, వీటికి రాజస్థాన్‌లో మంచి డిమాండ్ ఉంటోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా సీడ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నిలబడలేక నీరసించి..


ఓపీ కౌంటర్ దగ్గర బారులుతీరిన గర్భిణులు


స్కానింగ్ పరీక్షల కోసం నేలపై కూర్చొని..

ఒక్కరు కాదు..ఇద్దరు కాదు వందల మంది గర్భిణులు పరీక్షల కోసం ఆసుపత్రికి వస్తే అధికారులు కనీస సదుపాయాలు కల్పించలేకపోయారు. కనీసం కూర్చునేందుకు కుర్చీలు ఏర్పాటు చేయలేకపోయారు. తల్లీబిడ్డ సురక్షితంగా ఉండేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా..అధికార వైఫల్యం కారణంగా సోమవారం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఓపీ కోసం క్యూలో నిలబడలేక నీరసించి పోయారు. స్కానింగ్ పరీక్ష కోసం నేలపైనే గంటల తరబడి కూర్చోవాల్సి వచ్చింది. ప్రతి నెలా 9వ తేదీ ఆసుపత్రిలో స్కానింగ్ పరీక్షలు చేస్తామని, అయితే ఈ నెల ఆ తేదీ ఆదివారం వచ్చిందని, దీంతో మంగళవారం రమ్మని గర్భిణులకు చెప్పినట్లు డాక్టరు మైత్రేయి తెలిపారు. సోమవారమే గర్భిణులు రావడంతో వచ్చిన వారిని వెనక్కి పంపటం ఎందుకని 250 మంది స్కానింగ్ పరీక్షలు చేశామని చెప్పారు. ప్రతి సారీ కుర్చీలు వేస్తామని, ఇంత మంది వస్తారని తమకు తెలియలేదన్నారు.

– ఎమ్మిగనూరురూరల్

ఆడపిల్ల పుట్టిందని భర్త వేధిస్తున్నాడు!

- స్పందనలో ఫిర్యాదు చేసిన బాధితురాలు


స్పందనలో తమ సమస్యలు విన్నవిస్తున్న బాధితులు

కర్నూలు : ఆడపిల్ల పుట్టిందని కొంతకాలంగా భర్త వేధిస్తున్నాడని కల్లూరు మండలం పెద్దపాడు గ్రామానికి చెందిన కళావతి స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ ప్రసాద్ సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. తన భర్త మరొకరిని వివాహం చేసుకోవడానికి తనను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, విచారణ జరిపి తగు న్యాయం చేయాల్సిందిగా కళావతి అడిషనల్ ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. స్పందన కార్యక్రమానికి మొత్తం 50 ఫిర్యాదులు వచ్చాయి.

స్పందనకు వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...

- తనను రెండో వివాహం చేసుకుని గర్భసంచి తీయించి భర్త మోసం చేశాడని కర్నూలు వీకర్‌సెక్షన్ కాలనీకి చెందిన చిన్నక్క ఫిర్యాదు చేశారు.
- భర్త ఉపాధి హామీ పథకం కింద టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ పరస్త్రీ వ్యామోహంలో పడి తనను అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆస్పరి మండలం గార్లపెంట గ్రామానికి చెందిన వేదమణి ఫిర్యాదు చేశారు.
- ఇంటి ముందు పార్క్ చేసి ఉంచిన తన బైకును గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని కర్నూలు బి.క్యాంప్‌కు చెందిన సాంబశివుడు ఫిర్యాదు చేశారు.
- బుధవారపేటలో కొందరు యువకులు మత్తు పదార్థాలకు (వైట్నర్ తాగుతూ) అలవాటు పడుతున్నారని, నిఘా వేసి చర్యలు తీసుకోవాలని కొందరు బుధవారపేట వాసుల ఫిర్యాదు చేశారు. స్పందనకు వచ్చిన ఫిర్యాదులపై చట్ట పరిధిలో విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అడిషనల్ ఎస్పీ హామీ ఇచ్చారు. డీఎస్పీలు నాగభూషణం, యుగంధర్ బాబు తదితరులు స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఒకరు డిబార్

కర్నూలు సిటీ: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ పరీక్షల్లో ఒకరు డిబార్ అయ్యారు. సోమవారం జరిగిన పరీక్షలకు ఉదయం 4,936 మంది విద్యార్థులకుగాను 4,526 మంది, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 2,928 మంది విద్యార్థులకుగాను 2,673 మంది హాజరైనట్లు పరీక్షల విభాగం అధికారులు తెలిపారు.

మండు వేసవిలో జ్ఞాపకాల జడివాన

- 48 ఏళ్ల తర్వాత కలుసుకున్న వేల్పనూరు హైస్కూల్ పూర్వ విద్యార్థులు
- ఆనాటి గురువులకు ఆత్మీయ సత్కారం


ఉపాధ్యాయులతో కలిసి గ్రూప్ ఫొటో దిగిన పూర్వ విద్యార్థులు

వెలుగోడు: ఓ వైపు భానుడు ఉడికిస్తుండగా.. మరో వైపు జ్ఞాపకాల జడివాన కురిసింది. ఆత్మీయ పలుకరింపులతో అందరి కళ్లల్లో ఆనంద పరవళ్లు తొక్కింది. ఆనాటి మధురస్మృతులను గుర్తు చేసుకోవడంతో సంతోషం ఉప్పొంగింది. ఇందుకు వేల్పనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికైంది. ఇదే పాఠశాలలో 1974 – 1979 మధ్య 6వ తరగతి నుండి పదో తరగతి చదువుకున్న విద్యార్థులు వివిధ ప్రాంతాల్లో, వివిధ రంగంలో స్థిరపడిన వారు సోమవారం పాఠశాల ఆవరణంలో ఒకే చోట కలుసుకుని, పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆనాటి మధురమైన సంఘటనలు, చిలిపి చేష్టలను గుర్తుకు తెచ్చుకుని ఆద్యంతం ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. అప్పటి గురువులు సత్యనారాయణ, మహానందిరెడ్డి, అబ్దుల్ మజీద్‌లను ఘనంగా సత్కరించారు. దాదాపు 48 ఏళ్ల తరువాత పూర్వ విద్యార్థి పోతం రామకష్టారెడ్డి, తదితరుల ఆధ్వర్యంలో ఈ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో భాగంగా చదువులమ్మ ఒడిలో కలుసుకున్నారు. క్లాస్‌మేట్స్, బెంచ్‌మేట్స్‌తో ఆత్మీయ ఆలింగనంతో ఒకింత ఉద్వేగానికి లోనయ్యారు. అందరూ కలిసి సహపంక్తి భోజనాలు ఆరగించారు. గ్రూప్ ఫొటోలు దిగి జ్ఞాపకాలు మరింత పదిలం చేసుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామానికి చెందిన బూసిరెడ్డిగారి పుల్లారెడ్డి, రిటైర్డు ఎంఈవో రఘునాథరెడ్డి, హెచ్ఎం లింగన్న హాజరు కాగా..పూర్వ విద్యార్థులు బన్నూరు అంకిరెడ్డి, ఆర్.రామలింగేశ్వరరెడ్డి, డి. వెంకట్రామిరెడ్డి, డి. వన్నూరు సాహెబ్, జే.వెంకటేశ్వర్లు, జీ.మల్లయ్య, ఎం.ప్రతాపరాజు, తదితరులు పాల్గొన్నారు.